కథ

మల్లాది రమాంజలి

# ఏడేడు రంగుల ఉయ్యాల

నల్లత్రాచులా మెలికలు తిరిగిన రోడ్డు... రోడ్డుకు ఇరువైపులా పచ్చని పంట పొలాలు.. అంబరాన్నంటుకోవాలని ఆశపడే తాటిచెట్లు, దూరంగా అగ్గిపెట్టెల్లా కనిపిస్తున్న ఇళ్లు, చల్లని వాతావరణం, చక్కని పైరగాలి... ఆ చక్కని ఊరికి కొత్తగా వచ్చిన పల్లెవెలుగు బస్సులు...

రావులపాలెం బస్సు కోసం గంట నుంచీ ఎదురుచూస్తున్నాడు గంగరాజు. అనుభవంతో పండిన తల, కోరమీసం, పల్లెటూరి పంచెకట్టు, చేతిలో కాకీ గుడ్డ సంచి, ముంజేతికి కొత్తగా కొన్న గడియారం... మాటిమాటికీ టైమ్ చూసు కుంటున్నాడతను.

అమ్మాయి నిన్న ప్రొద్దుటే కబురు చేసింది... "నాన్నా! చంటిదాన్ని ఉయ్యాల్లో వేస్తున్నాము... అమ్మెట్టాగూ లేదు. నువ్వన్నా రా నాన్నా!" అంటూ.

వరిచేనుకోత కోస్తోంది. ఆ పంటొచ్చాకే తన చేతిలో 'కానీ' ఆడేది. చంటిదాని చేతిలో ఓ పది రూపాయలన్నా పెట్టాలా... రెక్కాడితే గానీ డొక్కాడని బ్రతుకులు. గాదెలో చూస్తే ఓ బస్తా కేసి ఒడ్లున్నాయి. అవి దుకాణంలో ఇచ్చేసి ఆరు వందలు సొమ్ము తీసుకున్నాడు గంగరాజు. దారి ఖర్చుకి ఓ ఏభై పోయినా పిల్లదాని చేతిలో ఓ మూడొందలు, కూతురి చేతిలో ఓ రెండొందలు పెడదామనుకున్నాడు. తను అమ్మిన ధాన్యం తప్ప ఇంట్లో ఒక్క గింజ లేదు. మరి తన తిండెట్టా...? తన పెళ్లాం బ్రతికుండగా ఆమె పుట్టింటి వాళ్లు ఇచ్చిన ఇత్తడి సామాను 'అడప' మీద అలాగే పడి ఉంది. అవి సంతలో అమ్మేసి, తన పంట చేతికొచ్చే వరకూ గడుపుదామనుకు న్నాడు గంగరాజు.

అతను ఆలోచనల్లో ఉండగానే బస్సొచ్చి ఆగింది. ఎక్కి కూర్చుని రావులపాలెం వరకూ టికెట్టు కొన్నాడు.

బస్సు ముందుకు దూసుకుపోతోంది. ఒక్కగా నొక్క కూతురు. లేటు వయసులో పుట్టటంతో అతి గారంగా పెంచుకున్నారు గంగరాజు దంప తులు. కూతురి ముచ్చట్లు చూసుకోకుండానే పచ్చకామెర్లతో కన్ను మూసింది గంగరాజు భార్య ముత్యాలు.

మరో గంటకి రావులపాలెంలో ఆగింది బస్సు. తన కూతురి ఇంటికి వెళ్లాలంటే లోపలికి ఓ మైలు దూరం నడవాలి. ఒంటెద్దు బళ్లు నడు స్తాయి లోపలికి. ఏదన్నా బండి కనిపిస్తుందేమో నని అటూ ఇటూ చూశాడు. దూరంగా ఓ బండి కనిపించింది. చెయ్యెత్తి బండతన్ని పిల్చాడు. గంగరాజు దగ్గరగా వచ్చి ఆగింది బండి. బండీ అతను తన కూతురు నూకాలుకి మరిది వరసవు తాడు.

"ఏంది మావా! ఊళ్లోకా... రా..రా.. బండెక్కు" మర్యాద చేశాడు, నూకాలు మరిది.

వెంటనే ఎక్కి కూర్చున్నాడు గంగరాజు.

"మా నూకాలు కూతుర్ని ఉయ్యాల్లో పెడత న్నారంట. రమ్మంటే వచ్చినా. నా బిడ్డ, మనవ రాలు ఎట్టా ఉందారయ్యా?" ప్రశ్నించాడు గంగ రాజు.

"ఏందో మావా! మా పెద్దమ్మ ఆశకు అంతు లేదు. రోజూ ఒదిన్ని సాదిత్తా ఉంటది. బిడ్డను ఉయ్యాల్లో ఎయ్యడానికి ఎంత రాద్ధాంతం చేసిం దనుకున్నావ్? బోల్డు కరుసవుద్దంట. ఊరంతా కులపోల్లని పిలిచి పేరటంకం సెయ్యాలంట. అయి ఇయి పంచి పెట్టాలంట. ఏం కట్నం తెచ్చి నావని ఏపుకు తింటాంది" జాలిగా అన్నాడు నూకాలు మరిది.

గంగరాజు గుండెల్లో రాయి పడింది. బిడ్డకు ఉయ్యాల పుట్టింటి వాళ్లే ఇవ్వాలి. టేకుదో, మారుజాతిదో ఉయ్యాల చేయించాలి... తన చేతిలో డబ్బు లేదు, ఎలా? నూకాలు అత్త కొంచెం నోరున్న మనిషే. ఒకటికి రెండుసార్లు కూతురు తనతో చెప్పుకొని ఏడిచింది... ఇప్పుడు తనకు నలుగురిలో అవమానం చెయ్యరు కదా!

దిగులు పట్టుకుంది గంగరాజుకి.

రోట్లో తలపెట్టిన తర్వాత రోకటిపోటుకి వెర వటమెందుకు? పంట చేతికి వచ్చాక చేయిస్తా నని చెపుతా... మనస్సుకి సర్దిచెప్పుకొని కూతురి ఇల్లు రావటంతో బండి దిగాడు గంగరాజు.

తండ్రిని చూడగానే ముఖం ఇంత చేసుకుని ఎదురొచ్చింది నూకాలు.

"బాగుండావా అమ్మా!" చేతి సంచి కూతు రికి అందిస్తూ పలకరించాడు.

"బాగున్నానయ్యా! నీ ఆరోగ్గెం బాగుందా" తండ్రి కాళ్లకి నీళ్లందిస్తూ అన్నది.

"నా ఆరోగ్గెనికేమి బాగానే ఉండా... బిడ్డ ఎట్టాగున్నాదమ్మా?"

"బాగుందయ్యా! ఇదిగో సూడు" మంచం మీద పడుకున్న పిల్లను తెచ్చి తండ్రి చేతికిచ్చింది.

అచ్చుగా తన కూతుర్లానే ఉన్నది మనవ రాలు... ప్రేమగా హత్తుకున్నాడు గంగరాజు.

"ఏంటయ్యోయ్... ఒట్టి చేతులు ఊపుకుంటా వచ్చినవ్. చంటిదానికి ఉయ్యాల తేవాలని తెలీదా! పుట్టింటోరే తేవాల. నువ్ తెచ్చేవరకూ ఈ పండగ చెయ్యం. ఆ మాట నీ కూతురితో కూడా చెప్పినా. నీక్కబురంపినాది. ఉయ్యాల్లే కుండా పిల్లనేడ పడుకో బెట్టుద్ది?" నూకాలు అత్త గంగరాజు మీద గయ్యిమంది.

"పంట చేతికొచ్చినాక చేపిత్తా సెల్లెమ్మా! నేనే చేపించాలని నాకూ తెలుసు... నాకాడ డబ్బుం దాలి గందా!" తనూ గట్టిగానే అన్నాడు.

"మరిప్పుడు ఎందుకొచ్చినట్టో?" మూతి తిప్పుతూ అన్నది నూకాలు అత్త.

"బిడ్డను చూసిపోదామని ఒచ్చా... మనమరా లితో కాసేపు కూకుని ఎల్తా"

"గుర్తెట్టుకో... అల్లుడొచ్చే వరకూ అమావసె ఆగుద్దా అని ఎన్నాళ్లు ఆగమంటావ్... సెప్పిన మాట నిలబెట్టుకోవాల" మరోసారి హెచ్చరించి లోపలికి నడిచిందామె.

* * *

వచ్చేటప్పుడు ఉన్న హుషారు ఒక్క నిము షంలో మాయమయింది గంగరాజుకి...

కూతుర్ని చూస్తుంటే కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. మనస్సుకి ఏ కష్టమొచ్చినా తల్లి ఉంటే ఆమెతో చెప్పుకునేది. తండ్రితో ఏమని చెప్పుకుంటుంది? ఉన్న ఎకరం పొలంలో అరెకరం అమ్మి కూతురి పెళ్లి ఘనంగానే జరిపించాడు. మిగతా పొలంలో పండే ధాన్యం తనకు ఏడాది పొడవునా సరిపోతుంది. అల్లుడు మంచివాడే గానీ... తల్లి దగ్గర నోరెత్తలేదు.

"నువు బాదపడబాకు మావా! పంట సేతికొచ్చాకే ఉయ్యాల చేపిద్దుగాన్లే. నువ్ కట్టపడబాక" తల్లి చూడకుండా మామగారిని ఊరడించాడు.

అత్తగారు గడుసుదైనా, అల్లుడు మంచివాడు దొరికాడని సంతోషించాడు గంగరాజు.

మరి కాసేపు మనవరాలి ముద్దు ముచ్చట్లు చూసి పసిదాని చేతిలో ఓ మూడు వందలు, నూకాలు చేతిలో ఓ రెండు వందలు ఉంచి బయలుదేరాడు గంగరాజు.

"ఏమయ్యోయ్.. మళ్లీ సెప్తన్నానుకోబాక... ఇంకో నాల్రోజుల్లో నువ్ ఉయ్యాల చేపిచ్చి పంపకపోతే ఊరుకునేది లేదు. ఆ... ఏమనుకుంటున్నావో. పంటొచ్చే వరకూ ఆగేది లేదు. ఏ ముచ్చట జరిగినా ఇప్పుడే జరగాల. నువ్వెళ్లగానే ఆ పని మీదుండు" గంగరాజును సాగనంపుతూ హెచ్చరించింది నూకాలు అత్తగారు.

తల ఒంచుకొని, సరేనన్నట్లు తల ఊపి బయటకు నడిచాడు గంగరాజు.

★ ★ ★

గాదెలో ఉన్న ఆఖరి బస్తా ధాన్యం కూడా అయిపోయింది. తిండి గింజలు లేవు. చేతిలో మరో యాభై తప్పు.. మరో నాలుగు రోజులే గడువుంది. ఏం చెయ్యాలి? తను మోజుపడి కొత్తగా కొనుక్కున్న గడియారం ప్రేమగా నిమిరాడు గంగరాజు.. శెట్టి దుకాణంలో అప్పోసప్పో చేసి తిండికి నాలుగు గింజలు సంపాదించుకుని, ఇత్తడి సామగ్రి అమ్మి పిల్లకు ఉయ్యాల కొంటే... మరో ఆలోచన వచ్చింది గంగరాజుకి. ఒకవేళ శెట్టి తనకు అప్పు ఇవ్వకపోతే... తను తిండిలేక మాడవలసిందేనా? ఏం చెయ్యాలో తోచటం లేదు గంగరాజుకి. బస్సు కోసం నిలబడిన అతని కాళ్లు గుంజుకు పోతున్నాయి. ఎండ వేడికి చెమటలు దిక్కారిపోతున్నాయి. ఒంటిలో నిస్సత్తువ ఆవరిస్తోంది.

"అయ్యా!" దూరం నుంచి ఎవరిదో పిలుపు.


అడ్డదారి వెంట పరుగున గంగరాజు వైపు వస్తోంది నూకాలు.

"అయ్యో! బిడ్డా! ఇంత దూరం వచ్చినావు. పసిబిడ్డ తల్లివి... ఒంటి పచ్చి ఆరనే లేదు. నా కోసం పరిగెత్తుకొచ్చినావా?"



గంగరాజు ప్రాణం విలవిలలాడింది.

నూకాలు ఆయాసంతో రొప్పుతోంది. ఆమె కట్టుకున్న చీరకొంగు బరువుగా వేళ్లాడుతోంది. దగ్గరగా వచ్చి...



"అయ్యా! నేనొచ్చే సరికి నువ్వెళ్లి పోతావేమోనని లగెత్తుకొచ్చా. నువ్వు ఎంత కట్టపడి ఈ దబ్బు తెచ్చినావో నాకు తెలవదా? మా అత్త దగ్గర నీకు ఇచ్చేస్తే ఏమంటరోనని ఆళ్లు సూడకుండొచ్చా... నువు ఆఖరి దాన్యం అమ్మినావని తెలుసు. నీ తిండి గింజలు ఉంచుకోకుండా అయీ నాకిచ్చినావని తెలుసు. నీ ప్రేవ సాలయ్యా! దబ్బెందుకు? మా అత్త ఉయ్యాల తెత్తేనే ఊరుకుంటానని ఎంత గట్టిగన్నదో... నువ్వెంత మనసు కట్టపెట్టుకున్నావో తెలుసు. ఈ దబ్బు నాకొద్దయ్యా! ఇయి తీసుకొని పిల్లకి ఉయ్యాల కొను... మళ్లీ నువు తలతాకట్టెట్టి ఎంత కట్టపడతావో, ఏ చెంబూ, తప్పేలా అమ్ముతావోనని బయంతో వచ్చా" కొంగుముడి విప్పి తండ్రి చేతిలో దబ్బు పెట్టింది నూకాలు.

"అయ్యో తల్లీ... నూకాలమ్మా! నే కట్టపడినా నువు సుకంగుంటే అంతే సాలమ్మా! ఇచ్చిన దబ్బు వెనక్కు తీసుకోకూడదు. నీకు పసుపూ, కుంకం కింద ఇచ్చాననుకో. ఎంత కట్టపడినా పిల్ల సుకంగుంటే కన్నోళ్లకి ఇంగేం


గావాలి? పెనుగాలికి ఎంత చెట్టయినా తలొంచక తప్పదమ్మా! ఎంత చెట్టుకి అంత గాలి... జాగరత్తగా ఇంటికెళ్లు... ఉయ్యాల తీసుకొని మళ్లీ నాల్రోజుల్లో ఒత్తా" డబ్బు కూతురి చేతిలో పెట్టి కన్నీళ్లు పెట్టుకున్నాడు గంగరాజు.

"మావా" అన్న పిలుపుకి వెనక్కి తిరిగారిద్దరూ. ఎప్పుడు వచ్చాడో నూకాలు మొగుడు సత్తిబాబు చేతిలో 'ఉయ్యాల'తో నిలబడి ఉన్నాడు.

సత్తిబాబు వంకా, అతని చేతిలోని ఉయ్యాల వంకా మార్చిమార్చి చూశారిద్దరూ.

"మావా! మా అమ్మ ఉయ్యాల అడిగినాదనీ, అది చేయించడానికి నువ్వెంత కష్టపడతావోనని నేనే చేయించా. నువు నాకు బంగారం పెట్టినా అది బంగారం లాటి నూకాలుకి బలాదూరే మావా! ఇదిగో ఇది తీసుకెళ్లి నాలుగు రోజులయినంక మళ్లీ రా. మా అమ్మకి నీవే చేయించినానని చెప్పు. దీనికోసం నీ దగ్గరున్నదంతా పోగొట్టుకొని నిలవనీడ లేకుండా చేసుకోమాకు మావా!" జాలిగా అన్నాడు సత్తిబాబు.

అల్లుడి వంక ఆశ్చర్యంగా చూశాడు గంగరాజు... అతని ఔదార్యానికి అతని కళ్లల్లో నీళ్లు తిరిగినాయి.




"బాబూ! నాకేం చెప్పాలో తోచటంలా. తల తాకట్టు పెట్టయినా ఉయ్యాల చేయిద్దామనుకున్నా. నువ్వు చేయించిన ఉయ్యాల నూపించి నే చేపించినాననటం మరియాద కాదయ్యా! నా మన నూరుకోవడంలా" సిగ్గుగా అన్నాడు గంగరాజు.

"ఏం కాదులే మావా! నూకాలు చేతిలో రెండొందలు పెట్టినావు, పిల్లదాని చేతిలో మూడొందలు పెట్టినావు, అయి ఉయ్యాలకిచ్చినానుకో. సిగ్గుపడమాకు మావా!" అనునయంగా అన్నాడు సత్తిబాబు.

"ఒద్దయ్యా! ఉయ్యాల నేనే పట్టుకొస్తా. నువ్వు చేయించింది ఉంచేసుకో. నా మనసొప్పటంలా" మళ్లీ అన్నాడు గంగరాజు.


"అది కాదు మావా! మా అమ్మ పాతకాలపు మడిసి. మేం ఈకాలపోల్లం. మేం గూడా అప్పటోల్లలా ఆలోచిత్తే ఎట్టా? అమ్మ ముందర మాట్టాడితే చిన్నబోతుందని మాట్టాడలా. నీ తిండిగింజలు అమ్మి, సామాన్లన్నీ అమ్మి చేయించిన ఉయ్యాల్లో పిల్లను పడుకోబెడితే దాన్ని నూసినప్పుడల్లా నీ కష్టవే గురుతొస్తాది. ఏది ఇచ్చినా సంతోసంగా ఇయ్యాల. మేం తీసుకోవాల. నీకాడ నాలుగు డబ్బులున్నప్పుడు సంతోసంగా ఇయ్యి... అప్పుడు తీసుకుంటాం. ఇప్పటికి ఇలా కానియ్యి" ఇంకో మాటకు అవకాశం లేనట్టుగా అన్నాడు సత్తిబాబు.

అల్లుడి మాటలకు మారుమాట్లాడలేకపోయాడు గంగరాజు.

"అయ్యా! డబ్బు కోసం ఆడకూతుళ్లని కష్టపెట్టే అల్లుళ్లని చూశాను గానీ నీలాంటి అల్లుడు దొరకటం నా అదురుట్టమయ్యా! ఏదో నా తృప్తి కోసం...దీన్ని తీసుకెళ్లి 'గిలక' లేయిస్తా. రంగులేయిస్తా. నేను సేసేపని నువు చేసినావు. నాకూ మనసొప్పుకోవాలి గదయ్యా. దీన్ని ఏడు రంగుల్లో మెరిపించి నా మన్మరాలికి కానుకగా ఇత్తా..." అపురూపంగా ఆ ఉయ్యాలను తీసుకొని అప్పుడే వచ్చిన బస్సెక్కాడు గంగరాజు.

నీళ్లు నిండిన కళ్లతో తండ్రికి వీడ్కోలు చెప్పింది నూకాలు.

○



## ఆయనగారు!

**చాలా కాలంగా రిలీజ్ కావాలా వద్దా? అని భయపడుతూ వచ్చిన 'కైట్స్' తీరా రిలీజయ్యాక ముందుగా అనుకున్నట్టే దారుణంగా ఫ్లాపయింది. అయితే ఈ సినిమాలో హృతిక్ నటన మాత్రం అమోఘం అనీ, దీనికి కచ్చితంగా ఆస్కార్ అవార్డు వచ్చితీరాలనీ ఒకరు భావిస్తున్నారు. వారెవరో తెలుసా? హృతిక్ రోషన్ భార్య సుజానే రోషన్. 'మా ఆయన నటన ఈ సినిమాలో అద్భుతంగా వుంది. ఆస్కార్ అవార్డు రావాల్సిన నటన ఆయనది' అంటూ తెగ పొగుడుతోందామె. అవును మరి, కాకిపిల్ల కాకికి ముద్దు అని ఊరికే అన్నారా?**